స్వామివారిని దర్శించుకుని వస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఘనంగా గుండ బ్రహ్మయ్య జాతర

స్వామివారిని దర్శించుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే చల్లా

బీఆర్ఎస్ ప్రభ బండి వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం, మార్చి 30 : మండలంలోని గవిచర్లలో ప్రతి ఏటా ఉగాది పండుగ సందర్భంగా జరిగే గుండ బ్రహ్మయ్య జాతర ఆదివారం ఘనంగా జరిగింది. వేడుకలకు సంగెం, రామచంద్రాపురం, లోహిత, కాపులకనపర్తి, కుంటపల్లి, కాట్రపల్లి, తీగరాజుపల్లి గ్రామాలతో పాటు వరంగల్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. బీఆర్ఎస్ ప్రభబండి వద్ద మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడారు. జాతర సందర్భంగా పర్వతగిరి సీఐ రాజగోపాల్, సంగెం, పర్వతగిరి ఎస్సైలు ఎల్ నరేశ్, ప్రవీణ్ బందోబస్తు నిర్వహించారు.

కాజీపేట మీదుగా వేసవి ప్రత్యేక రైళ్లు

కాజీపేట, మార్చి 30 : వేసవి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఉత్తర భారతదేశానికి కాజీపేట మీదుగా చర్లపల్లి– హజ్రత్ నిజాముద్దీన్ రైల్వేస్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మొత్తం 26 ట్రిప్పులు నడుపనున్నారు. చర్లపల్లి నుంచి ఏప్రిల్ 6 నుంచి జూన్ 29 వరకు ప్రతి ఆదివారం బయలుదేరి హజ్రత్ నిజాముద్దీన్ చేరుకుంటుంది. హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ నుంచి ఏప్రిల్ 8 నుంచి జూలై 1 వరకు ప్రతి మంగళవారం బయలుదేరి చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైళ్లు రాకపోకల్లో కాజీపేట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, నాగపూర్, ఇటార్సీ, భోపాల్, బీనా, ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా రైల్వే స్టేషన్లలో ఆగుతాయని, స్పెషల్ రైళ్లకు 2ఏసీ, 3ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఉంటాయన్నారు. టికెట్ రిజర్వేషన్లు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు.

నీళ్లు లేక నోళ్లు తెరుస్తున్న పాలాలు



పెంచికల్‌పేటలో ఎండిపోయిన ఊడుగుల కుంట

ఎల్కతుర్తి, మార్చి 30 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేటలోని ఊడుగులకుంట పూర్తిగా ఎండిపోవడంతో చుట్టు పక్కలున్న బావులు, బోర్లలో నీళ్లు అడుగంటిపోయాయి. ఈ కుంటలో ఏటా యాసంగి పంటకు నీళ్లుండేవి. అయితే ఈ సీజన్ ప్రారంభంలోనే ఇది ఎండిపోవడంతో సాగు నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఈ కుంట కింద దాదాపు 60 ఎకరాల వరకు సాగవుతుండగా, ఇప్పటికే సగం వరకు పొలాలు ఎండిపోయి నెరెలుబారాయి.

త్రివేణి సంగమం వద్ద తగ్గుముఖం పడుతున్న నీరు

సరస్వతీ పుష్కరాలకు గోదావరి కష్టాలు

- ఎండుతున్న త్రివేణి సంగమం
- తగ్గుముఖం పడుతున్న నీరు
- వీఐపీ ఘాట్ నుంచి ఇసుక రవాణా

జయశంకర్ భూపాలపల్లి, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : సరస్వతీ పుష్కరాలకు నీటి కష్టాలు తప్పేలా లేవు. రోజురోజుకూ గోదావరిలో నీటి మట్టం తగ్గుతుండగా, నీటిని నిల్వ చేయడంలో అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. సరస్వతీ పుష్కరాల కోసం అధికారులు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అయి తే, పనుల కోసం గోదావరి నుంచి భారీగా ఇసుకను తరలిస్తుండడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. నీటి ప్రవాహం సమీ పం నుంచే ఇసుకను తరలిస్తుండడంతో నీటి మట్టం మరింత అడుగంటి పుష్కరాలకు వచ్చే భక్తులు ఇబ్బంది పడే అవకాశాలున్నాయి. కాంట్రాక్టర్లు టీఎస్ఎండీసీ నుంచి ఇసుకను తీసుకొని పనులు చేయాల్సి ఉండగా, నేరుగా గోదావరి నుంచే ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు తెలుపుతున్నారు. ముఖ్యంగా వీఐపీ ఘాట్ నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. మే 15 నుంచి 26 వరకు కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరా లు జరుగనున్నాయి. మరో 45 రోజుల్లో పుష్కరాలు ప్రారంభం కా నుండగా, పనుల్లో మాత్రం వేగం కనబడడం లేదని భక్తులు తెలుపుతున్నారు. 45 రోజుల్లో గోదావరిలో నీరు పూర్తిగా అడుగంటిపో యే అవకాశాలున్నాయని గ్రామస్తులు తెలుపుతున్నారు. అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు గోదావరి లో నీటిని నిల్వ చేయాల్సిన అవసరం ఉంది. మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లలో పూర్తిగా గేట్లు తెరిచి ఉంచడంతో నీళ్లు కిందికి వెళ్లిపోతున్నాయి. అలాగే ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో నీరు అడుగంటిపోతుంది.

గోదావరిలో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ఇసుక

విప్ప పువ్వు వచ్చేసింది..

- ప్రారంభమైన సేకరణ
- ఏజెన్సీ వాసులకు ఉపాధి
- కల్పతరువుగా పూలు, గింజలు

వాజేడు, మార్చి 30: అటవీప్రాంతంలో విప్ప పూవు సేకరణ ప్రారంభమైంది. విప్ప చెట్లు ఈ సంవత్సరం ఆశించి స్థాయిలో లేకపోయినప్పటికీ వేసవికాలంలో మిర్చి కోతల తరువాత గిరిజనులతో పాటు గొత్తికోయలు ఎక్కువగా విప్పపూల సేకరణపై ఆధారపడి వాటిని సేకరించే పనిలో నిమగ్నమవుతున్నారు. తెల్లవారక మందే గిరిజనులు కుటుంబ సమేతంగా విప్పపూవు సేకరణ కోసం వెళ్తారు. అప్పటికే నేల రాలిన పూలను ఏరుకుని బుట్టలు, సంచుల్లో నింపుకుంటారు. తిరిగి పది గంటల వరకు ఇంటికి చేరుకుంటారు. సేకరించిన విప్పపూవును గిరిజనులు ఆర బెట్టుకుంటున్నారు. బాగా ఎండిన తర్వాత బుట్టలో వేపాకు వేసుకుని వీటిని ఇండ్లల్లో భద్రపర్చుకుంటారు. ఇవి పురుగుపట్టకుండా ఉంటాయి. తర్వాత తమ అవసరాలకు వాడు కుంటారు. ప్రధానంగా వీటిని ఉడకబెట్టుకుని, వేపుడు చేసుకుని తింటారు. ఇక వీటిని గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో



ఏర్పాటు చేసిన గిరిజన సహకార సంస (స్టోర్లలో)లేదా బయటవారికి అమ్మి సొమ్ము చేసుకుంటారు.

పూలు, గింజలతో బహుళ ప్రయోజనాలు

విప్ప చెట్ల నుంచి సేకరించే పూవ్వులతో ప్రకృతి సిద్ధమైన విప్ప సారా తయారు చేసుకొని కొందరు సేవిస్తారు. ఆలయాల వద్ద విప్ప పూలను ప్రసాదంగా అమ్ముతారు. అంతేకాకుండా విప్ప కాయలతో నూనె తీసి వంటకు వాడుకోవచ్చు. పూజల్లో దీపారాధనకు సైతం ప్రత్యేకంగా విప్ప నూనెను వాడుతారు. విప్ప తైలంతో శరీరం మర్దన చేస్తే వ్యాధులు సైతం నయమవుతాయని పూర్వీకుల నమ్మకం. ఇంత ప్రాధాన్యత ఉన్న విప్ప చెట్ల నుంచి వచ్చే విప్ప పువ్వు సుగంధ ద్రవ్యాలను ప్రజలు సేకరిస్తున్నారు.

పారా ట్రోబాల్ పోటీల్లో కృష్ణవేణి ప్రతిభ

మూడో స్థానంలో నిలిచిన భారత జట్టు

ట్రోఫీ, జాతీయ పతాకంతో కృష్ణవేణి

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 30 : కాంబోడియాలో జరిగిన ఫస్ట్ ఏషియన్ పారా ట్రోబా ల్ చాంపియన్ షిప్‌లో జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం విశ్వనాథపురం గ్రామానికి చెంది న మాచర్ల కృష్ణవేణి ప్రతిభ కనబరిచింది. ఈ నెల 28 నుంచి 30 వరకు కాంబోడియా రాజధాని ఫునంపెన్‌లో జరిగిన పోటీల్లో ఎనిమిది దేశాలతోపాటు భారతదేశం నుంచి ఎనిమిది రాష్ట్రాల క్రీడాకారులు హాజరుకాగా, తెలంగాణ నుంచి మాచర్ల కృష్ణవేణి పా ల్గొంది. ప్రథమ స్థానంలో కాంబోడియా, ద్వితీయ స్థానంలో థాయిలాండ్, తృతీయ స్థానంలో ఇండియా నిలిచి కాంస్య పతకం సాధించినట్లు కృష్ణవేణి తెలిపారు. ఇదిలా ఉండగా గత డిసెంబర్‌లో కాంబోడియాలో జరిగిన సిట్టింగ్ పారా ట్రోబాల్ అంతర్జాతీయ పోటీల్లో కృష్ణవేణి పాల్గొన్నది. అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తీసుకొస్తున్న కృష్ణవేణిని క్రీడాభిమానులు, క్రీడా సంఘాల బాధ్యులు అభినందించారు.

నేటితో ముగియనున్న ఎల్ఆర్ఎస్, ఓటీఎస్ గడువు

సోమవారం పని చేయనున్న హెల్ప్ డెస్క్, మీ సేవ కేంద్రాలు

వరంగల్, మార్చి 30 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం, ఆస్తి పన్ను అపరాధ రుసుముపై 90 శాతం రాయితీ పథకాలు నేటితో ముగియనున్నాయి. కాగా, వరుసగా సెలవు రోజులు కావడంతో అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పన్నుల వసూళ్లు, ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌లు పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. పన్నులపై అపరాధ రుసుములో 90 శాతం మాఫీకి ఒక్క రోజు మాత్ర మే అవకాశం ఉండడంతో క్షేత్రస్థాయిలో పన్నుల విభా గం సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. ఈ క్రమంలో మీ సేవ కేంద్రాలు తెరిచే ఉంటాయని అధికారులు ప్రకటించారు. అందివచ్చిన సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పిలుపునిచ్చారు. అన్‌లైన్ ద్వారా ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. వన్ టైం సెటిల్‌మెంట్ పథకం ద్వారా పన్నుల చెల్లించే వారి కోసం బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు క్షేత్రస్థాయిలో అం దుబాటులో ఉంటారని తెలిపారు. సిటిజన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవ కేంద్రాలు, వెబ్‌సైట్, జీడబ్ల్యూఎంసీ యాప్ ద్వారా పన్నులు చెల్లించాలని కోరారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న బైక్

ఇద్దరు యువకులు మృతి

దిలీప్, క్రాంతికుమార్ (ఫైల్)

చిల్పూరు, మార్చి 30: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలం చిన్నపెండ్యాల సమీపంలో జరిగింది. స్థానికులు, చిల్పూరు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన ఎర్ర దిలీప్ (25), స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన చింత క్రాంతికుమార్ (24) బైక్‌పై ఆదివారం రాత్రి తాటికాయల నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో చిన్నపెండ్యాల మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్నది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

బాబోయ్ బడ్జెట్

ఈ 5 పోస్టాఫీస్ స్కీములతో పన్ను లాభం

తపాలా శాఖ నుంచి వచ్చే చిన్న మొత్తాల పొదుపు పథకాలను.. దేశంలోనే అత్యంత సురక్షితమైన పెట్టుబడి సాధనాలుగా చెప్పవచ్చు. ఇందుకు కారణం భారత ప్రభుత్వం భరోసా ఉండటమే. పైగా ఆయా స్కీముల్లో పెట్టుబడులపై, వాటిద్వారా పొందే ఆదాయంపై ఆదాయ పన్ను చట్టం–1961లోని సెక్షన్ 80సీ కింద మదుపరులకు పన్ను మినహాయింపులూ వర్తిస్తాయి. ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలదాకా క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇలాంటి ఐటీ ప్రయోజనాలున్న 5 పోస్టాఫీస్ స్కీములను ఒక్కసారి పరిశీలిస్తే..

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)

అత్యంత ప్రజాదరణ పొందిన దీర్ఘకాలిక పెట్టుబడి పథకాల్లో పీపీఎఫ్ ఒకటి. కనీస పెట్టుబడి రూ.500. గరిష్ఠం ఏటా రూ.1.5 లక్షలు. పీపీఎఫ్‌పై వడ్డీరేటు ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి 7.1 శాతం. పీపీఎఫ్‌లో డిపాజిట్లకు, దానిపై పొందే వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలను తీసుకున్నా ఎలాంటి పన్నులూ ఉండవు.

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ (ఎన్ఎస్సీ)

ఎన్ఎస్సీ అనేది ఓ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీం. దీనిద్వారా గ్యారంటీడ్ ఆదాయం, ట్యాక్స్ సేవింగ్స్ రెండూ ఉంటాయి. ఈ ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి గాను వడ్డీరేటు 7.7 శాతం. మెచ్యూరిటీపై పొందవచ్చు. ఇక ఈ స్కీంలో కనీసం రూ.1,000, గరిష్ఠంగా ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చు. ఎన్ఎస్సీ కాలపరిమితి ఐదేండ్లు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి. అయితే పన్ను ప్రయోజనాల కోసం తొలి నాలుగేండ్లలో రీఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్వై)

ఆడపిల్లల కోసం ఉద్దేశించిన పథకమే ఈ ఎస్ఎస్వై. ఇందులో పన్ను ప్రయోజనాలతో కూడిన అధిక రాబడులుంటాయి. కనీసం రూ.250, గరిష్ఠంగా ఏటా రూ.1.5 లక్షల వరకు పెట్టుబడిగా పెట్టవచ్చు. పెట్టుబడికి, వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలకు పన్నులుండవు. ఈ ఏడాది ఏప్రిల్–జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతంగా ఉన్నది. వార్షిక ప్రాతిపదికన లెక్కిస్తారు. ఏటేటా చక్ర వృద్ధిని అనుసరించి లాభాల్ని అందిస్తారు.

సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్)

వృద్ధులను ఉద్దేశించి తెచ్చిన పథకం ఇది. ఎస్‌సీఎస్ఎస్‌లోనూ పన్ను ప్రయోజనాలతో కూడిన లాభాలుంటాయి. ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠ పెట్టుబడికున్న పరిమితి రూ.30 లక్షలు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయానికి పన్నుంటుంది. ఈ ఏప్రిల్–జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతం.

ఐదేండ్ల పోస్టాఫీస్ టైం డిపాజిట్ (పీవోటీడీ)

ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000. గరిష్ఠంగా ఎంతైనా పెట్టుకోవచ్చు. వడ్డీ ఆదాయానికి పన్నులు వర్తిస్తాయి. రూ.1.5 లక్షల దాకా పెట్టుబడులకు పన్ను మినహాయింపు లుంటాయి. అయితే ఐదేండ్లలోపు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే పన్ను ప్రయోజనాలు వర్తించవు. ఈ ఏప్రిల్–జూన్‌కిగాను వడ్డీరేటు 7.5 శాతం. మూడు నెలలకోసారి లెక్కించి ఏడాదికోసారి చెల్లిస్తారు.

గోల్డ్ Vs నిఫ్టీ 50

దీర్ఘకాల పెట్టుబడికి ఏది ఉత్తమం?

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇటీవలి ర్యాలీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీలకు గొప్ప లాభాలనే అందించింది. ఒక్క వారంలోనే సుమారుగా సెన్సెక్స్ 4.35 శాతం, నిఫ్టీ 4.45 శాతం చొప్పున ఎగిశాయి మరి. అయితే ఇన్వెస్టర్స్ పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులను ఎంచుకోవడానికి లేదా పెంచుకోవడానికి ఇది చాలదు. ఎందుకంటే ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా అంటే జనవరి–మార్చిలో అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ రెండూ ఇంచుమించుగా 1 శాతం, 0.60 శాతం చొప్పున పడిపోయాయి. ఇదే సమయంలో బంగారం, వెండి ధరలు దాదాపు 17 శాతం, 15 శాతం మేర పెరిగాయి. ఇంకా లోతుగా చెప్పాలంటే జనవరి 1న సెన్సెక్స్ 78,139.01 పాయింట్ల వద్ద మొదలైంది. ఇప్పుడిది 77,414.92 పాయింట్ల వద్ద ఉన్నది. అలాగే నిఫ్టీ 23,644.80 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రస్తుతం 23,519.35 పాయింట్ల వద్ద నిలిచింది. ఫలితంగా సెన్సెక్స్ 724.09 పాయింట్లు, నిఫ్టీ 125.45 పాయింట్లు కోల్పోయినట్టింది. కానీ బంగారం ధర రూ.78,950 నుంచి రూ.92,150కి ఎగబాకింది. వెండి ధర రూ.89,700 నుంచి రూ.1,03,000లకు చేరింది. దీంతో గోల్డ్, సిల్వర్ రేట్లు గడిచిన 3 నెలల్లో రూ.13,200, రూ.13,300 చొప్పున ఎగిసినట్టైంది.

ఇదీ సంగతి..

పైన చెప్పుకున్న లెక్కలన్నీ స్వల్పకాలిక పెట్టుబడి ఆధారిత గణాంకాలే. కానీ మనం ఇక్కడ చెప్పుకోవాల్సింది దీర్ఘకాలిక పెట్టుబడికి ఏది ఉత్తమం? అన్నదే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పెంపు హెచ్చరికలు.. భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చాయి. దీంతో మెజారిటీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల రక్షణార్థం బంగారం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలు స్టాక్ మార్కెట్ సూచీలను దిగువకు, గోల్డ్, సిల్వర్ సూచీలను ఎగువకు పంపాయి. ఇక భారత్ విషయానికొస్తే.. బంగారాన్ని సురక్షిత మదుపు సాధనంగా భావిస్తుంటే, బ్రాడర్ ఈక్విటీ మార్కెట్‌కు, దేశ ఆర్థిక ప్రగతికి నిఫ్టీనే ప్రాతిపదికగా తీసుకుంటారు. కాబట్టి మదుపరుల పెట్టుబడి లక్ష్యాలు, రిస్క్ అనేవి ఇక్కడ కీలకం అని గుర్తుంచుకోవాలి. వాటి ప్రకారం..

దీర్ఘకాల రాబడులు

గడిచిన రెండు దశాబ్దాల్లో దేశీయంగా మదుపరులకు బంగారంపై పెట్టుబడులు 8–10 శాతం మేర చక్ర వార్షిక వృద్ధిరేటును అందించాయి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ పసిడిపై మదుపు ఆకర్షణీయ ప్రదర్శననే ఇచ్చింది. అయితే దీర్ఘకాలంలో నిఫ్టీలో పెట్టుబడులు 12–15 శాతం వరకు చక్ర వార్షిక వృద్ధిరేటును చూపాయి. దీంతో వృద్ధికే మీ ప్రాధాన్యత అయితే నిఫ్టీ పెట్టుబడులే లాభదాయకం.

ద్రవ్యోల్బణం సవాళ్లు

ద్రవ్యోల్బణాన్ని అధిగమించాలంటే బంగారం చక్కని సాధనం. కరెన్సీ విలువ తగ్గితే ఇది పెరుగుతుంది. ఇక స్టాక్ మార్కెట్లు సైతం ద్రవ్యోల్బణాన్ని మించి పరుగులు పెడుతున్నాయి. కంపెనీల లాభాలు, ఆదాయం గణనీయంగా పెరుగుతుండటంతో నిఫ్టీదే పైచేయి.

ఒడిదుడుకులు

పుత్తడి ధరల్లో ఒడిదుడుకులు తక్కువే. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభాల ప్రభావం పెద్దగా ఉండదు. స్టాక్ మార్కెట్లపై ప్రతీ చిన్నదాని ప్రభావం కనిపిస్తుంది. అయినా త్వరగా కోలుకుంటాయి. స్థిరత్వాన్ని కోరుకునే మదుపరులకు బంగారమే ఉత్తమం. అయితే ఒడిదుడుకులను తట్టుకుని, ఓపిగ్గా ఎదురుచూస్తే నిఫ్టీ లాభం.

ద్రవ్య లభ్యత

భౌతిక బంగారాన్ని నగదుగా మార్చుకోవడం కొంత ఇబ్బంది. నాణ్యత, తయారీ ఇతరత్రా ఖర్చులు ఎదురవుతాయి. డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఈ సమస్య ఉండదు. స్టాక్ మార్కెట్లలో షేర్ల క్రయవిక్రయాలు సులభం. నగదు లభ్యత వేగంగానే ఉంటుంది. కాబట్టి పసిడి కంటే నిఫ్టీ ఇన్వెస్ట్‌మెంట్స్‌నే త్వరగా క్యాష్ చేసుకోవచ్చు.

పోర్ట్‌ఫోలియో

బంగారం ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో రిస్క్‌ను తగ్గిస్తుంది. కానీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో ఉంటాయి. అయితే దీర్ఘకాల పెట్టుబడులకు ఈక్విటీలే సరైనవని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ మాట.

చివరగా..

మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులనుబట్టి తమ పోర్ట్‌ఫోలియోల్లో స్థిరత్వాన్ని కోరుకునే భారతీయ మదుపరులకు బంగారంపై పెట్టుబడులే ఉత్తమం. అయితే పోర్ట్‌ఫోలియోల్లో వేగవంతమైన వృద్ధిని కోరుకునే ఇన్వెస్టర్లకు ఈక్విటీలే నయం. అయితే నిపుణుల సలహాతో ముందుకెళ్తే మరింత లాభదాయకం.

ఆటో, జీఎస్టీ గణాంకాలు కీలకం!

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం పడుతూ, లేస్తూ కొనసాగినా లాభాలనైతే నిలబెట్టుకున్నాయి. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) ఆఖర్లో పెట్టుబడులకు ముందుకు రాకున్నా సూచీలు వృద్ధినే కనబర్చాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 509.41 పాయింట్లు లేదా 0.66 శాతం లాభపడి 77,414.92 వద్ద ఆగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 168.95 పాయింట్లు లేదా 0.72 శాతం పెరిగి 23,519.35 దగ్గర నిలిచింది. అయితే ఈ వారం మదుపరుల పెట్టుబడులు ఫిబ్రవరి ఆటో అమ్మకాలు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) గణాంకాల ఆధారంగా కొనసాగే వీలున్నట్లు మెజారిటీ నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు కీలకమని గుర్తుచేస్తున్నారు. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ఎఫ్ఐఐ పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,800–24,000 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, అయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

ఆరోగ్య బీమా.. ఓ స్మార్ట్ పెట్టుబడి



నేడు

వైద్య ఖర్చులు ఏ స్థాయిలో పెరిగిపోయాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా తప్పనిసరి అంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం.. మీ కుటుంబ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టినట్టే. ఇక గతంతో పోల్చితే ప్రస్తుతం అందుబాటులో ఉంటున్న ఆరోగ్య బీమా పాలసీలు.. కేవలం దవాఖానల్లో చేరికలకేగాక, ఓపీడీ సంప్రదింపులు, టెలీ మెడిసిన్, ముందస్తు వైద్య పరీక్షలు, ప్రసూతి, మానసిక, రిహాబిలిటేషన్, ఇతర ఆరోగ్య సంరక్షణ సేవల్నీ అందిస్తుండటం విశేషం. నిజానికి మారిన జీవనశైలితో ఇప్పుడు చాలా మంది వయసుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. గుండె–కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదాలబారిన కూడా పడుతున్నారు. దీంతో ఇలాంటివారికి ఆరోగ్య బీమా, ప్రధానంగా క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్లుండే పాలసీల అవసరం చాలా ఉంటున్నది. ఇలాంటి కవరేజీలను ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌సహా అనేక సంస్థలు ప్రభావవంతంగా అందిస్తున్నాయి. పైగా ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంలపై పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు. 60 ఏండ్ల లోపువారికి ఏటా రూ.25,000దాకా, ఆపై వయసున్న సీనియర్ సిటిజన్లకు రూ.50,000 వరకు పన్ను మినహాయింపులను పొందవచ్చని నిపుణులు చెప్తున్నారు. కాబట్టి ఈ ఉగాదితో మొదలైన కొత్త ఏడాదిలో ఆరోగ్య బీమా ఆవశ్యకతను గుర్తించి ఓ సానుకూల నిర్ణయం తీసుకోండి. ఒకవేళ ఇప్పటికే ఆరోగ్య బీమా ఉన్నట్టైతే.. సమగ్ర కవరేజీలుండే, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే మరింత మెరుగైన బీమాను కొనడం ఉత్తమం.